మినీకథ

# రాంగ్ ఫ్రెండ్

ఆఫీసులో ఆఫీసర్లు (టెలిఫోన్ వున్న) ఎవరైనా సెలవు పెడితే వాళ్ళదగ్గిర్న వున్న ఫోనులను ఎంగేజ్ చెయ్యటం మా క్లర్కులలో చాలామందికి పరిపాటి ఆ రోజు మా ఆఫీసర్ ఏదో పనిమీద లీవ్ పెట్టేడు అది నాకు ముందు తెలియదు ఆఫీసు పనిమీద ఆయన రూంకి వెళితే ప్యూన్ చెప్పాడు ఆఫీసరుగారు లీవ్ లెటర్ పంపించారని ఆయనగారులేరని తెలిసిం తరువాత ధైర్యంగా ఒక్కసారి డోరుతెరచి రూంనిపరీక్షగాచూసారు అక్కడ ఉన్నవాటిలో నన్ను అమితంగా ఆకర్షించింది ఆయన టేబిల్ మీదనున్న రెడ్ కలర్ ఫోన్ సమయానికి ఫోన్ నెంబర్లు నోటుచేసుకున్న డైరీ ఇవ్వాళ ఇంటినుంచి తేలేదని నొచ్చుకున్నాను నాకు బాగా నోటిమీద వున్న నెంబర్ పాషాది పాషాని కలిసికూడా చాలా కాలమయింది కనీసం ఒక్కసారి ఫోన్లో ఐనా మాటలాడుదామని పాషా ఫోన్ నెంబర్ డయల్ చేశాను

డయల్ చేసింతరువాత అనుమానం వేసింది చివరి నెంబర్ కరక్టా కాదా అని

కాకపోతే మళ్ళీ చెయ్యొచ్చులే అనుకొని రిసీవర్‌ని చెవి దగ్గిరకి తెచ్చాను

'హల్లో' మృదుమధురమైన గొంతు

రిసీవర్‌ని చెవికి మరింత దగ్గిర పెట్టేను

'ఎవరండి మాట్లాడేది అదే గొంతు ఎంతో శ్రావ్యంగా

అది పాషా నెంబర్ కాదు పాషా ఇంట్లో ఎవ్వరికీ తెలుగు రాదు

నేను చేసింది రాంగ్ నెంబర్ రిసీవర్ చెవిని మరింత హత్తుకుంది

ఆ స్త్రీ గొంతు మళ్ళీమళ్ళీ వినాలనిపిస్తోంది

నేను తికమక పడిపోతున్నాను

మీరు ఏ ఫోను నెంబర్నుంచి మాట్లాడుతున్నారని అడిగాను

నేను నిజంగానే పొరబడ్డాను చివరి నెంబర్ రాంగ్‌గా డయల్ చేశాను

'సారీ! రాంగ్ నెంబర్' అనకుండా తప్పలేదు

రిసీవర్ పెట్టేసిన శబ్దం

బరువుగా నేనూ రిసీవర్‌ని క్రిందకి దించేశాను

ఎంత మధురమైన గొంతు! కోకిల జ్ఞాపకం వచ్చింది గొంతే అలా వుంటే ఇక మనిషి ఎలా వుంటుందో?

ఇలాంటి వాళ్ళతో మాట్లాడితేనే చాలు! జన్మ తరించినట్లు!

బ్రహ్మచారి బుద్ధులు ఎక్కడికిపోతాయి

వారం రోజులైం తరువాత మళ్ళీ అవకాశం వచ్చింది - డబ్బుపెట్టి ఫోను చెయ్యనవసరం లేకుండా

ఈసారి తెలిసే నాక్కావలసిన రాంగ్ నెంబర్ డయల్ చేసా!

"హల్లో!" గంభీరమైన గొంతు

బితుక్కుమన్నాను అనుకున్నది కాకపోయేసరికి

'ఎవరండి?' అదే స్టైయిల్లో!

ఏం అడగాలో తెలియక 'రాంబాబు వున్నాడాండి?' తడబడుతూ అన్నాను

'లేదండి ఇప్పుడే కాలేజీకి వెళ్ళాడు మీ రెక్కడ్నించి మాట్లాడుతున్నారు, మీ పేరేమిటో చెప్పండి!'

గతుక్కుమన్నాను

'మే ఐనో యువర్ నేమ్?' మర్యాదగా అడుగుతోంది ఆ గొంతు

'రాజారావు!' నా అసలు పేరు మర్చిపోయాను

'మీ రిప్పుడే కదండి వచ్చింది!!'

బిత్తరపడిపోయి ఫోన్ పెట్టేశాను □

—మొవ్వ బాబూరావు